క్లుప్తంగా

ఎండాకాలం భృతి ఇవ్వండి

సింగరేణి(కొత్తగూడెం): వ్యవసాయ కూలీలకు ఎండాకాలంలో ఉపాధి కల్పించాలని లేదా భృతి ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలో జరిగింది. వారు మాట్లాడుతూ.. ఉపాధి పనులపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఉపాధి హామీ చట్టం సమగ్రంగా అమలు చేయకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయిని రాజు, గోకినపల్లి ప్రభాకర్, పూణెం కుమార్, పూనెం రమేష్, కే.ముత్యాలరావు, వెంకటమ్మ పాల్గొన్నారు.

సబ్సిడీ విడుదల చేయించండి

కొత్తగూడెంరూరల్: జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని లబ్ధిదారులు కనకం సూరిబాబు, రవి ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్‌ను శుక్రవారం హైదరబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల ఎంపిక జరిగి 18 నెలలు గడుస్తోందని, అయినా సబ్సిడీ రాలేదని, దీంతో యూనిట్ గ్రౌండింగ్ ఆగిపోయిందని జీఎంకు వివరించారు. జిల్లాలో ఎంపికైన లబ్ధిదారులు సబ్సిడీ కోసం ఎదురు చూస్తున్నారని వెంటనే మంజూరయ్యేలా కృషి చేయాలని కోరారు. స్పందించిన జీఎం సబ్సిడీ విడుదల జరిగేలాగా కృషి చేస్తానని తెలిపారు.

'చలో కొత్తగూడెం'

జూలూరుపాడు: ఈ నెల 19న జిల్లా కేంద్రం కొత్తగూడెంలో జరిగే ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆర్ఎంపీల మండల అధ్యక్షుడు బి.రామరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం జూలూరుపాడులోని సాయి ఎక్స్‌లెంట్ స్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం జరుగుతుందన్నారు. మహాసభలకు ఆర్ఎంపీలు, పీఎంపీలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నివారించండి



ధర్నా చేస్తున్న న్యూడెమోక్రసీ కార్యకర్తలు

ఇల్లెందురూరల్: వ్యవసాయానికి, గృహాలకు 24 గంటల నిరంతర విద్యుత్ అందిస్తామని గొప్పగా చెప్పుకున్న ప్రభుత్వం ఆచరణలో విఫలమైందని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు విమర్శించారు. కరెంటు కోతలను తక్షణం నివారించాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించి ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏడీఈ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు ఎదుగుతున్న దశలో వ్యవసాయానికి కనీసం ఆరు గంటలపాటు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని, ప్రస్తుతం నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సురేందర్, పాడుగు నర్సింహారావు, సారంగపాణి, మోకాళ్ల కృష్ణ, పూనెం కోటయ్య, శ్రీను, రాంచందర్, ఎర్రయ్య పాల్గొన్నారు.

శివాలయాలు ముస్తాబు

- నేడు మహాశివరాత్రి...
- శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



కొత్తగూడెంటౌన్: రైటర్‌బస్తీలోని శ్రీమాతా శక్తి క్షేత్రం

కొత్తగూడెంటౌన్: పరమశివుడికి అత్యంత ఇష్టమైన శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు జ్యోతిర్లింగార్చనలు, అభిషేకాలు, జాగారాలతో భక్తిశ్రద్ధలతో పవిత్ర పూజలు చేస్తారు. శనివారం మహాశివరాత్రి కావడంతో శివాలయాలు, ఇళ్లలో శివరాత్రి మహోత్సవం ఘనంగా జరుపుకునేందుకు భక్తులు సిద్ధమయ్యారు. భక్తులు జాగరం, ఉపవాసం చేసేందుకు ఏర్పాటు చేసుకున్నారు. కొత్తగూడెంలోని బూడిదగడ్డలో శివాలయం, రైటర్‌బస్తీలోని శ్రీమాతా శక్తి ఆలయం, రామవరంలోని క్లబ్ ఏరియా ప్రాంతంలోని శివాలయం, రుద్రంపూర్, గౌతంపూర్‌లోని శివాలయల్లో, ప్యూన్‌బస్తీ, విద్యానగర్‌కాలనీలోని శివాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలోని గుట్టలపై శ్రీసోమేశ్వర(సోమన్న) స్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామసర్పంచ్ గుగులోత్ రాందాస్, ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇల్లెందురూరల్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీ పూసపల్లి గ్రామంలో వీరభద్రుని కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ పూజారులు, గ్రామపెద్దలు ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. సుమారు యాభై ఏళ్లుగా గ్రామంలో స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 18వ తేదీన ఉదయం 9 గంటలకు పసుపు కుంకుమ పూజతో జాతర ప్రారంభమవుతుందని ఆలయ ధర్మకర్త తెలమ సుగుణ తెలిపారు.

ఇల్లెందు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద శివాలయం, హరిహరి క్షేత్రం, కళాసీబస్తీలోని శివాలయాలను ముస్తాబు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశారు. 400 ఏళ్ల చరిత్ర కలిగిన కోటిలింగాలను దర్శించుకునేందుకు భక్తులు తరలిరానున్నారు.

టేకులపల్లి: మహాశివరాత్రి వేడుకలు శనివారం ఘనంగా జరగనున్నాయి. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కొండంగులబోడులోని వీరభద్ర భద్రకాళి మాత ఆలయం, సిద్ధారంలోని నటరాజ ఆలయం, మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం తదితర ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివరాత్రి సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



ఇల్లెందు: చెరువు కట్ట వద్ద శివాలయం



టేకులపల్లి: కొండంగులబోడులో..



ఇల్లెందురూరల్: మిట్టపల్లిలో ముస్తాబైన వీరభద్రస్వామి అలయం



జూలూరుపాడు: భేతాళపాడు శ్రీసోమేశ్వర ఆలయం వద్ద కల్యాణానికి సిద్ధం చేసిన మండపం



ఇల్లెందు: పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద శివాలయం

అవినీతిపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న అన్నవరపు సత్యనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): శ్రీనగర్ పంచాయతీలో జరిగిన అక్రమాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో మండల కమిటీ సమావేశం వాంకుడోత్ అమర్‌సింగ్ అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ.. శ్రీనగర్ పంచాయతీ పరిధిలో సుమారు రూ.1.50 కోట్లు అవినీతి జరిగిందని, ఆర్టీఐ 2005 సమాచార హక్కు చట్ట ప్రకారం అధికారులు ధృవీకరించినా... ఈరోజు వరకు అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా రికవరీ చేయకపోవటం ఏంటని ప్రశ్నించారు. అధికారుల ముందు అవినీతికి పాల్పడిన వారు వాంగ్మూలం కూడా ఇచ్చారని వారిపై కలెక్టర్, పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం శోచనీయమన్నారు. పంచాయతీలో జరిగిన అవినీతిపై సీపీఎం ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతుందని, జరిగిన అవినీతిని కరపత్రాల ద్వారా ఇంటింటికి ప్రచారం చేస్తామని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉప్పనపల్లి నాగేశ్వరరావు, వాంకుడోత్ కోబల్, కరణం వీరభద్రం, నల్లమల్ల సత్యనారాయణ, కీసరి ఆదినారాయణ, నూనావత్ సూర్య, ధరావత్ వెంకన్న, తేజావత్ వత్తు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శ్వాస మీద ధ్యాసతో మానసిక ఒత్తిళ్లు దూరం



కోయగూడెంలో ధ్యానం చేస్తున్న స్థానికులు

టేకులపల్లి: శ్వాస మీద ధ్యాసతో అనేక రుగ్మతలతోపాటు మానసిక ఒత్తిళ్లు దూరం అవుతాయని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, ఉమ్మడి ఖమ్మం జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.హనుమంతరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి కోయగూడెం గ్రామంలో జెడ్పీ చైర్మన్ నివాసంలో శ్వాసపై ధ్యాస, ధ్యానం, సంగీత కార్యక్రమం నిర్వహించారు. హాజరైన స్థానికులచే ధ్యానం చేయించారు. రోగాలకు కారణం మాంసాహారమేనని ప్రతిఒక్కరూ శాకాహారం అలవర్చుకుని, ధ్యానం చేసుకుంటే ఆరోగ్యమే మహాభాగ్యంగా జీవించొచ్చన్నారు. శాకాహారం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూనెం ఉమ, మాజీ సర్పంచ్ పూనెం సురేందర్, వడ్డె అప్పారావు, రాధ, రమేష్, అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

టేకులపల్లి: మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామం బర్లగూడెంలో జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య శుక్రవారం పర్యటించారు. జెడ్పీ నిధులు రూ.5లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో క్రీడాకారులకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, ఏజెన్సీ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆ తరువాత గ్రామస్తులతో ముచ్చటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, వ్యవసాయం, జీవనోపాధి తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూనెం రాంబాబు, నాయకులు పూనెం సురేందర్, ఈది గణేష్, మోకాళ్ల పోశాలు, భూక్యా సర్దార్, రావూరి సతీష్, చందర్‌సింగ్, గడ్డం మధురెడ్డి, తులసీరామ్, పూనెం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిమ్ కార్డు కోసం వెళ్లి దాడి

కొత్తగూడెంఅర్బన్: సెల్‌ఫోన్‌లో సిమ్‌కార్డు కొనుగోలుకు వెళ్లిన మహిళకు షోరూం యజమానికి మధ్య ఏర్పడిన వివాదం దాడికి దారి తీసింది. కొత్తగూడెం గణేష్‌టెంపుల్ సమీపంలోని ఓ షోరూంనకు పట్టణానికి చెందిన మహిళ శుక్రవారం సిమ్‌కార్డు కోసం వెళ్లింది. ఈక్రమంలో యజమాని లక్ష్మణ్ అగర్వాల్, సదరు మహిళకు వాగ్వాదం జరగగా మహిళకు అండగా నిలిచిన సంతోష్.. అగర్వాల్‌పై దాడి చేశాడు. లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం



కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు వంటి పథకాలు చారిత్రకమైనవని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాలపై దృష్టి సారించారని, ఇటువంటి సమయంలో ఆయనకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, రైతుబంధు సమితి రాష్ట్ర సలహాదారు పులిగళ్ల మాధవరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ జానీ, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్ ఎంపీపీ ప్రమోద్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, ఆత్మ చైర్మన్ భావ్‌సింగ్, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీఓ అప్పారావు, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ: ముఖ్యమంత్రి కేసీఆర్ డబల్ బెడ్ రూం ఇళ్లను ఎక్కడా ఇవ్వడం లేదని, అక్కడక్కడా నిర్మించిన ఇళ్లు సైతం నాసిరకంగా ఉన్నాయని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం పట్టణంలోని జగ్గుతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ.. కేసీఆర్ ఎన్నికల హామీలను విస్మరించారని విమర్శించారు. ధరణి పేరుతో రైతులను దగా చేశారని, దళిత బంధు పేరుతో వంచించారని, అధిక ధరలతో పేదల జనజీవనం అస్తవ్యస్తంగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, సేవ్యా, చారి, పైడిపల్లి మనోహర్, బద్ది కిశోర్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో లక్ష్యాలను సాధించాలి



సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న ఏరియా జనరల్ మేనేజర్ రమేష్

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, అందుకు తగ్గట్టుగా ప్రణాళికలను రూపొందించుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీబీ నగర్‌లోని స్వర్ణలత పాఠశాలలో సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు.

మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్ కోసం పాఠశాల నుంచే ఒక నిర్ణయం తీసుకొని, ఏం చదివితే భవిష్యత్ ఉంటుందో ఎంచుకోవాలని, ఉపాధ్యాయుల సలహాలతో వాటిని సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. దేశంలో ఎందరో మహనీయులు ఈ స్థాయిలో తీసుకున్న నిర్ణయం వలన ఉన్నత స్థానానికి చేరుకొని దేశానికి సేవ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మీరు కూడా వారి అడుగుజాడల్లో నడుచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సామ్యూల్ సుధాకర్, ఎస్ఎస్ఓ రమణారెడ్డి, ఎండీ గౌస్, స్వర్ణ భారతి హెచ్‌ఎం, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇలాఖాలో ఇందేటి?



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కామేష్

పాల్వంచ: పట్టణంలోని కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న పాలకోయ తండా గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో తండాలో పర్యటించారు. మాట్లాడుతూ.. నాలుగుసార్లు ఎమ్మెల్యే, మంత్రిగా చేసిన వనమా సొంత గడ్డ అని చెప్పుకునే పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని పాలకోయ తండాలో ప్రజలకు కనీస సౌకర్యాలు లేవన్నారు. ఎనిమిది నెలలుగా తాగు నీరు రాక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, భూక్యా కళావతి, భగవత్, సరిత, భూక్యా నాగేశ్వరరావు, షాకిరా బేగం, గుగులోతు దీప, అజ్మీరా పద్మ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధ్యాపకులు



మొక్క నాటుతున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

ఇల్లెందురూరల్: సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని మండలలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, అధ్యాపకులు శుక్రవారం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని హరితమయం చేసే లక్ష్యంగా కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు జన్మదిన బహుమానంగా కళాశాలలో విరివిగా మొక్కలు నాటుతున్నామని చెప్పారు. ప్రతిఒక్కరూ ఒక్క మొక్క నాటి సీఎం కేసీఆర్ హరితయజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, అధ్యాపకులు చెంచురత్నయ్య, పిచ్చయ్య, శారద, సురేంద్రకుమార్, శేఖర్, సరిత, ఈశ్వర్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌రావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలుచోట్ల పేదలకు అన్నదానం చేశారు. భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



సూపర్‌బజార్(కొత్తగూడెం): కేక్ కట్ చేస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



ఇల్లెందురూరల్: కేక్ కట్ చేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ



జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. ఎమ్మెల్యే రాములు నాయక్



పాల్వంచ: విద్యుత్ కళాభారతి ఆడిటోరియంలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న సీఈలు



కొత్తగూడెంఅర్బన్: నెహ్రూ బస్తీలో మొక్కలు నాటుతున్న వైద్య సిబ్బంది



సుజాతనగర్: శివాలయంలో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో...



ఇల్లెందు: కార్తీక్ యాదవ్‌కు కేక్ తినిపిస్తున్న మున్సిపల్ చైర్మన్ డీవీ



చుంచుపల్లి: పెనగడపలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో యువకులు



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్

జూలూరుపాడు: ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డులో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ మాట్లాడుతూ..

బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి కల్పించడంలో విఫలమైందని, రైతులకు లక్ష రూపాయాల రుణమాఫీ అమలు చేయలేదన్నారు. వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, బీజేపీ మండల అధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్‌రావు, పుల్లారావు, గోపాల్‌రావు, నరేష్, వందనపు సుబ్బు, కిరణ్, హమాలీలు పాల్గొన్నారు.

సుజాతనగర్: బడుగు, బలహీన వర్గాలవారిని చిన్నచూపు చూస్తున్న ఈ ప్రభుత్వం త్వరలో వారి ఆగ్రహానికి గురికాక తప్పదని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ అన్నారు. ప్రజా గోస – బీజేపీ భరోసా యాత్రలో భాగంగా సుజాతనగర్‌లో శుక్రవారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్‌ఎస్ వలన ఏ వర్గానికి న్యాయం జరగలేదన్నారు. నరేంద్రమోదీ సారథ్యంలో భారతదేశం ప్రపంచదేశాలతో పోటీ పడుతోందన్నారు.

కార్యక్రమంలో అసెంబ్లీ ప్రభారి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, మాచర్ల నరసింహా, భూక్యా రాజేష్, నరేంద్రబాబు, నాగేశ్వరరావు, ఖాసిం, వినీల్‌కుమార్, వెంకటేష్, ప్రసాద్, వెంకన్న, శివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడు: హాజరైన కార్యకర్తలు, ప్రజలు



సుజాతనగర్: మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

బి. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148
భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476
ఇల్లెందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాప్రసాద్ - 79979 58226
టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమన శుభాకాంక్షలు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416